## రాయలచెరువు పీహెచ్‌సీలో ల్యాబ్ రికార్డుల పరిశీలన



యాడికి, జనవరి 10 (అనంత ప్రభ)

జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ల్యాబ్ లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎఫ్ 2, ఎంఎఫ్ 8, ఎంఎఫ్7, డైరీ, పెండెన్సీ చార్ట్‌లను సక్రమంగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతకు సూచించారు. అన్ని రికార్డులు నిర్దిష్ట నిబంధనల ప్రకారం పూర్తిగా, స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జ్వరం లక్షణాలతో వచ్చే ప్రతి ఒక్కరికీ డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్ తదితర వ్యాధులపై అవసరమైన రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు సేకరించిన రక్త పూతలను కూడా వెంటనే పరీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్వైజర్ షబ్బీర్ అహమ్మద్, ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత తదితరులు పాల్గొన్నారు

## గాలి పటాల ఎగరవేతలో జాగ్రత్తలు పాటించాలి



యాడికి, జనవరి 10 (అనంత ప్రభ)

సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు గాలి పటాలు ఎగరేసే సమయంలో పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షణ వహించాలని యాడికి మండల విద్యుత్తు ఏ ఈ విజయుడు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి పటాలు ఎగరేసేటప్పుడు కరెంటు వైర్లు, విద్యుత్ తీగల సమీపంలో ఆటలు ఆడకూడదని, ముఖ్యంగా దారం లేదా మంజా తీగలకు తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ లైన్లకు దారం తగిలితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగవచ్చని హెచ్చరించారు. అందుకే పిల్లలు గాలి పటాలు ఎగరేసేందుకు ఖాళీ ప్రదేశాలు, మైదానాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలకు అవసరమైన భద్రతా సూచనలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పండుగ ఆనందం ప్రమాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## స్టీల్ ప్లాంట్ ఎదుట రైతుల ధర్నా



గుమ్మఘట్ట, జనవరి 10 (అనంత ప్రభ)

స్టీల్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న వ్యర్థాల కారణంగా పంట నష్టపోయామని, వెంటనే తమకు నష్టపరిహారం చెల్లించాలంటూ రాయదుర్గం మండలం రాయంపల్లి సమీపంలో ఉన్న గవిసిద్ధేశ్వర స్టీల్ ప్లాంట్ ఎదుట శుక్రవారం ఆ గ్రామ రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రుసిద్దస్వామి, గోవింద, మోహన్, సుధీర్, రాజు, శశిధర్, క్రిష్టప్ప, రాజు, భీమ మాట్లాడారు. పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా పంటల దిగుబడి చేతికి అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరిహారం చెల్లించకపోతే న్యాయ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సర్ది చెప్పడంతో ఆందోళనను రైతులు విరమించుకున్నారు.

## ప్రకృతి సేద్యాన్ని విస్తరించాలి



అనంతపురం, జనవరి 10 (అనంత ప్రభ)

రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు ప్రకృతి సేద్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనంత సుస్థిర వ్యవసాయ వేదిక కన్వీనర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి అన్నారు. రసాయనాలు, క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో పండించిన కల్తీలేని ఆహారోత్పత్తుల వినియోగంపై ప్రజలు దృష్టి సారిస్తే.., ప్రకృతి సేద్యం విస్తరిస్తుందని పేర్కొన్నారు. అనంత సుస్థిర వ్యవసాయ వేదిక' ఆధ్వర్యంలో 18 స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా అనంతపురంలోని పోలీసు కాంప్లెక్స్‌లోని కల్యాణమంటపం వేదికగా ఏర్పాటు చేసిన 'మిల్లెట్ మేళా'కు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజు శుక్రవారం జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది రైతులు, నగరవాసులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. చిరుధాన్యాలు, వాటితో చేసిన తినుబండారాలు, సేంద్రియ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, పండ్లు, పూల ప్రదర్శనశాలలు, విక్రయశాలలను ఆసక్తిగా గమనించి కావాల్సిన వాటిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ వైవీ మల్లారెడ్డి, సీసీడీ ప్రతినిధి త్రిలోకనాథశాస్త్రి, ఏపీ మాస్ సీఈఓ సీఎస్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ విభాగం చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (సీటీఐఓ) వి.లక్ష్మనాయక్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, తెలంగాణాకు చెందిన రైతు నరసింహారెడ్డి తదితరులు మాట్లాడారు. కష్టం రైతుది అయితే సంపాదన మాత్రం దళారులు, వ్యాపారులకు దక్కుతోందన్నారు. మార్కెటింగ్ మెలకువలు పాటిస్తే రైతు ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని తెలిపారు. ప్రజారోగ్యం మెరుగుపడి అనారోగ్యానికి వెచ్చించే ఖర్చులు తగ్గాలంటే సేంద్రియ పద్ధతుల పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్స్ ప్రతినిధి భానుజా, కార్డు ప్రతినిధి నిర్మలారెడ్డి, ఆర్ఆర్ఏ నెట్‌వర్క్ ప్రతినిధి సుజుల్ కులకర్ణి, ఎఫ్ఈఎస్ వ్యవస్థాపకులు భక్తర్‌వలీ, ఏఎఫ్ఈసీ చీఫ్ అపరేషన్స్ జే.మురళీకృష్ణ, రిడ్స్ పీడీ వి.కిష్టప్పతో పాటు సీసీడీ, వాసన్, టింబక్టు, ఏపీమాస్, సీఎస్ఏ, జనజాగృతి, యాపిల్, పాస్, గ్రామ్‌వికాస్, అనంత నాచురల్స్, తిరుమల ఆర్గానిక్స్, డిజిటల్ గ్రీన్ తదితర ఎన్‌జీఓ ప్రతినిధులు శంకర్, గోపాల్, సుకన్య, ఉత్తప్ప, రమణ, శ్రీనివాసరెడ్డి, హనుమంతరెడ్డి, రామప్ప, తిరుపాలు, నరేంద్ర, విజయభాస్కర్, నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ నందు ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కూడేరు, జనవరి 10 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం రోజున 1996-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటిగా గురువులైన (ఉపాధ్యాయుల) కు శాలువాలు కప్పి పూలహారాలతో అభినందించారు. అనంతరం విద్యార్థి, విద్యార్థినిలు మాట్లాడుతూ మేము విద్య ను అభ్యసించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సుదీర్ఘకాలం అనంతరం మళ్లీ పూర్వ విద్యార్థుల కలయిక సమ్మేళనంతో ఈ పాఠశాల నందు అన్న, తమ్ముల్లు ,అక్క చెల్లెలు, అనే సోదర సోదరీ భావంతో కలవడం చాలా ఆనందంగా ఉందని,నాడు ఇదే పాఠశాల నందు ఒకరికి ఒకరు స్నేహపూర్వకంగా సోదర, సోదరి భావంతో కలిసిమెలిసి చదువుకునేవారమని నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ ఆత్మీయ కలయిక సందర్భంగా అందరూ ఒకే చోట కలవడం చాలా ఆనందంగా ఉందని మాకు చిన్న వయసులో తల్లిదండ్రులు లాగా విద్యాబుద్ధులు నేర్పి మాకు బంగారు భవిష్యత్తును తీర్చినటువంటి గురువుల ను ఎన్నటికీ మరువలేమని మేము ఈరోజు ఉద్యోగు రిత్య కొందరు వివిధ రకాల వృత్తులలో మరికొందరు స్థిరపడినందుకు చాలా సంతోషంగా ఉందని జీవితంలో ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వివిధ వృత్తులతో స్థిరపడినందుకు గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, విద్యార్థినిలు ఆత్మీయ కలయిక సందర్భంగా ఉపాధ్యాయులకు మరియు ఒకరికి ఒకరు అభినందనలు తెలియజేసుకున్నారు

## విజన్ విద్యాసంస్థలో సంప్రదాయ వైభవంతో సంక్రాంతి సంబరాలు





యాడికి, జనవరి 10 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా ఘనంగా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అతిథుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమాలు పండుగ శోభను ఉట్టిపడేలా చేశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన యాడికి సీఐ శ్రీనివాసులు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా వీక్షించి అభినందించారు. పండుగల ద్వారా భారతీయ సంప్రదాయాలు, విలువలు తదుపరి తరాలకు చేరాలని తెలిపారు. క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తనతో పాటు విద్యాభ్యాసంలో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సంక్రాంతి ప్రత్యేకతను ప్రతిబింబించే రంగవల్లుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలించిన సీఐ శ్రీనివాసులు విజేతలకు బహుమతులు అందజేశారు. రంగవల్లుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులుని విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన బొమ్మల కొలువు, పిట్టలదొర, హరిదాసు, డుడు బసవన్న వంటి సంప్రదాయ వేషధారణలు పండుగకు ప్రత్యేక కళను తెచ్చాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రుద్రమ నాయుడు, గుండా నారాయణ స్వామి, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, మధురాజు, రామచంద్ర, రంగస్వామి, వెంకటస్వామి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే విజన్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ఖమ్మం బహిరంగ సభకు సిపిఐ పిలుపు



యాడికి, జనవరి 10 (అనంత ప్రభ)

ఈ నెల 18న తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ పార్టీ శత వార్షికోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ యాడికి మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం యాడికి మండల కేంద్రంలో సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో జీపు జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ప్రజల మధ్య నిత్యం ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న సీపీఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఖమ్మంలో ఘనమైన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు రైతులు, కూలీలు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, కుళ్లాయప్ప, జిల్లా అధ్యక్షుడు నాగరాజు నాయక్, కళాకారులు గిరి, వెంకటరాముడు, సీపీఐ సీనియర్ నాయకులు శ్రీరాములు, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఓబిరెడ్డి, సూర్యనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి కుళ్లాయిరెడ్డి, సీపీఐ నాయకులు ఆంజనేయులు, తాంద్ర సుభా, ఆదినారాయణ రెడ్డి, మల్లారెడ్డి, ప్రబోధ్, మాబూ, శ్రీరాములు, కంబగిరి, రామాంజులరెడ్డి, చైతన్య, చీమలవాగుపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## రీ--సర్వేలో తప్పులు ఉంటే ఇప్పుడే సరిచేసుకోవాలి



నల్లమాడ, జనవరి 10 (అనంత ప్రభ)

నల్లమాడ మండలం వంకరకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన రీ--సర్వే గ్రామ సభను జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ ఆకస్మికెనా సందర్శించి తనిఖీ చేశారు. రీ--సర్వే ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో... ఫిబ్రవరి నెలలో పంపిణీ చేయనున్న పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఎలాంటి తప్పులు లేకుండా రైతులు ముందుగానే పరిశీలించి, ఏవైనా ఉంటే సరిచేసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా రైతులతో జేసి ముఖాముఖి మాట్లాడారు. రీ--సర్వేలో నమోదైన వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే వెంటనే గ్రామ రెవెన్యూ అధికారి, తహసీల్దారు, ఆర్డీవో దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులకు నష్టం కలగకుండా అన్ని తప్పులను సకాలంలో సరిదిద్దే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

అనంతరం గోపేపల్లి గ్రామాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించి, ఇప్పటికే పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రీ--సర్వేకు సంబంధించిన తప్పులు, అభ్యంతరాలను తక్షణమే సరిచేయాలని ఆర్డీవో, తహసీల్దారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దారు కె. మనోజ్ కుమార్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి జగన్మోహన్ రెడ్డి, గ్రామ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉరవకొండ జనసేన పార్టీ ఇన్చార్జి గౌతమ్ కుమార్



ఉరవకొండ, జనవరి 10 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గౌతమ్ కుమార్ శనివారం రోజున కలియుగ దైవం తిరుమల, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరికి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో మళ్లీ వచ్చే ఏడాది వరకు ప్రజలందరిపైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండేలా చల్లగా చూడాలని తిరుమల శ్రీవారిని మొక్కుకున్నారు.

## నేటి నుంచి 'కీబోర్డ్స్ టు విలేజెస్'



అనంతపురం, జనవరి 10 (అనంత ప్రభ)

వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16 వరకు రైతు కష్టాన్ని గుర్తించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సంకల్పం 'కీబోర్డ్స్ టు విలేజెస్' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో రైతులు, మహిళలు పడుతున్న ఇబ్బందులు, పల్లె స్థితిగతులను 'కీ బోర్డ్స్ టు విలేజెస్' ద్వారా వెలుగులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగకు వచ్చే ఐటీ ఇంజినీర్లు, వివిధ వృత్తి నిపుణులు, ప్రైవేట్ ఉద్యోగులు నేరుగా ఆయా పల్లెల్లోని మహిళలు, వృద్ధులతో మాట్లాడి వీడియోలు తీసి అప్‌లోడ్ చేస్తారన్నారు. ఇప్పటికే రైతులు పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం సలీం, సోషల్ మీడియా విభాగం అనంతపురం నియోజకవర్గం అధ్యక్షుడు పవన్‌కుమార్ శ్రావణ్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రాధాకృష్ణ, దామోదర్‌రెడ్డి, శేఖర్ నాయుడు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం నగర అధ్యక్షులు గా నియమితులైన సుధాకర్ యాదవ్



శింగనమల, జనవరి 10 (అనంత ప్రభ)

అనంతపురం నగర అధ్యక్షులు గా నియమితులైన సుధాకర్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేయడమైనది అనంతపురం నగర అధ్యక్షులుగా నియమితులైన సుధాకర్ యాదవ్ అన్న మరియు సింగనమల మండలం మార్కెట్ యార్డ్ చైర్మన్ లిదండు శ్రీనివాసులు తెలుగు యువత నాయకులు కాయల సురేష్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సింగనమల చెరువు కట్ట ఆయికట్టు చైర్మన్ జి. సత్యనారాయణ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కాయల అనిల్ కుమార్ యాదవ్ డీలర్ మసూద్ వలి ఉల్లి కళ్ళు చలమయ్య ఐటిడిపి మునేంద్ర దేరంగుల శంకరయ్య కాయల శివ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## నష్టపోయిన గొర్రెల కాపర్ల కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకుంటాం...ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



శింగనమల, జనవరి 10 (అనంత ప్రభ)

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గొర్రెల కాపర్లను పరామర్శించిన టిడిపి నాయకులు

శింగనమల మండలం సీ.బండమీదపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణకు చెందిన గొర్రెల మంద విషపు నీరు తాగి గొర్రెలు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించారు.నష్టపోయిన గొర్రెల కాపర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామినిచ్చారు. ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు గొర్రెల కాపరులు నరసింహ,రాజశేఖర్,రాధాకృష్ణ, అకులప్ప,వెంకటరమణ ల కుటుంబాలను పరామర్శించినట్లు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కాయల అనిల్ కుమార్ యాదవ్,చెరువు ఆయకట్టు ఛైర్మేన్ బోయ సత్యనారాయణ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ పద్మనాభం మరియు టిడిపి నాయకులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు